సాక్షి
జనగామ
బుధవారం । 26 । ఫిబ్రవరి । 2025



కమ్యూనిస్టుల పునరేకీకరణకు కృషి

దేశం, రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులున్నా ప్రజల కోసం పోరాడుతామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. - 8లో▸



బోగస్ మాటలు కట్టిపెట్టండి

అబద్ధాలు చెప్పి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$34^0/19^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

శివ పూజకు వేళాయె..

నేడు మహాశివరాత్రి పర్వదినం

- వేలాదిగా తరలిరానున్న భక్తులు
- జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన ఆలయాలు



జనగామలో శ్రీ రామలింగేశ్వరుడు



సిద్ధులగుట్టలో విద్యుత్ కాంతుల వెలుతురులో శివపార్వతులు



పాలకుర్తి టౌన్: విద్యుత్ కాంతుల వెలుతురులో సోమేశ్వర ఆలయం గుట్ట



విద్యుత్ దీపాల వెలుగులో చీటకోడూరు శ్రీ పంచకోసు రామలింగేశ్వర స్వామి దేవాలయం

జనగామ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలన్నీ విద్యుత్ దీపాల వెలుతురులో కాంతులీనుతున్నాయి. శివ, దేవేరి పార్వతి వివాహం కూడా ఇదే రోజున జరగనుంది. జిల్లాలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి.

కలెక్టర్ పర్యవేక్షణ..

ప్రశాంత వాతావరణంలో భక్తులు స్వామిని దర్శించుకునేందుకు కలెక్టర్ రిజ్వాన్ బాషా నేతృత్వంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్రనాయక్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు శ్రమిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుకుండా ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ వేణుమాధవ్ పర్యవేక్షణలో ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆలయాల ప్రాంగణంలో పరిశుభ్రత పాటించే విధంగా డీపీఓ నాగపురి స్వరూప ఆధ్వర్యంలో డీఎల్‌పీఓ, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

వేలాదిగా తరలిరానున్న భక్తులు

జిల్లాలోని శివాలయాలు నేడు శివనామ స్మరణలతో మారుమోగనున్నాయి. మహాశివరాత్రిని పురస్కరించుకుని పాలకుర్తి శ్రీ సోమేశ్వర స్వామి, బచ్చన్నపేట మండలం కొడవటూరు సిద్ధులగుట్ట, పట్టణంలోని పాతబీటు బజారు శ్రీ రామలింగేశ్వరస్వామి, జనగామ మండలం చీటకోడూరు శ్రీ పంచకోసు రామలింగేశ్వ రాలయాలతో పాటు పలు ఆలయాలకు వేలాది మంది భక్తులు తరలిరానున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలు గకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ఆలయాల్లో ఏర్పాట్లు - 8లో▸

పాలకుర్తి సోమేశ్వర ఆలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు



సోమేశ్వరాలయంలో ధ్వజారోహణం

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. గుట్టపై మహామండపంలో గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం, అంకురార్పణ, రుత్విక్‌వరుణ, ధ్వజారోహణం, వేదస్వస్తి, త్రిశూలపూజ, స్వామివారికి అభిషేకాలు, అఖండ దీపారాధన అర్చకులు నిర్వహించారు. ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, ఎస్సై దూలం వపన్‌కుమార్, సూపరింటెండెంట్ వెంకటయ్య, అర్చకులు అనిల్‌కుమార్, నాగరాజు, భక్తులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావుల ఆధ్వర్యంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, ధర్మకర్తలు గనగోని రమేష్, వేముల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్‌కు నేటి (బుధవారం) నుంచి మూడు రోజుల పాటు సెలవులను ప్రకటించినట్లు ఇన్‌చార్జ్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి నరేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 26వ తేదీ శివ రాత్రి, 27న పండుగ ప్రత్యేకం, 28వ తేదీ అమావాస్య సందర్భంగా సెలవులను ప్రకటించగా, మార్చి 1వ తేదీన మార్కెట్‌లో సేవలు పునఃప్రారంభమవుతాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించాలి

జనగామ రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న జిల్లాలోని అన్ని పాఠశాలల్లో సైన్స్ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.రమేశ్, జిల్లా సైన్స్ అధికారి ఉపేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ పాఠశాలలో సైన్స్‌పై ఆసక్తి పెంచే కార్యక్రమాలు జరపాలని, పాఠశాల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు పేరెంట్స్ కమిటీ, స్థానికుల సహకారంతో బహుమతులు అందజేయాలని సూచించారు. క్విజ్, సైన్స్ సెమినార్, చిత్రలేఖనం, పుస్తక ప్రదర్శన, పరికరాల ప్రదర్శన, ప్రయోగ ప్రదర్శనలు, బోధనాభ్యాసన సామగ్రి తయారీ, ప్రాజెక్టులు, శాస్త్రవేత్తలపై ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓ సూచించారు.

మార్కెట్ విలువ ఆధారంగా నష్టపరిహారం ఇవ్వాలి



జనగామ రూరల్: పట్టణంలోని ఎన్‌హెచ్ 165 రోడ్డులో ఏకశిలా పెట్రోల్ పంపు వెనకాల నుంచి జనగామ రైల్వే ట్రాక్ వరకు ప్లాట్లు కోల్పోతున్న బాధితులకు మార్కెట్ విలువ ఆధారంగా నష్ట పరిహారం ఇవ్వాలని హైకోర్టు న్యాయవాది సాదిక్ అలీ అన్నారు. మంగళవారం సాదిక్ ఫౌండేషన్ కార్యాలయంలో బూడిది గోపి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తక్షణమే ప్లాట్లు కోల్పోతున్న యజమానుల జాబితాను ప్రకటించాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు ప్రజా పోరాటాలకు సిద్ధమని తెలిపారు. కలెక్టర్ మానవీయ కోణంలో అర్థం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ హైవే ప్లాట్లు యజమానుల బాధిత కమిటీ ఉపాధ్యక్షులు యేల జనార్దన్, సలహాదారులు బిర్రు స్వప్న, కార్యదర్శి వేమునూరి రాజేంద్రప్రసాద్, కోశాధికారి గుడెల్లి కృష్ణారెడ్డి, నల్ల యాదగిరి, గాజుల శేఖర్, ఏనుగుల సునీత, పబ్బ సుధాకర్, భూపతిరెడ్డి, శ్రీనివాస్ విజయ్, వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం


జనగామ రూరల్: ఉత్తమ ఉర్దూ టీచర్ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి విక్రమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో 2024–25 సంవత్సరానికి గాను ఉర్దూ పాఠశాల, కళాశాలలకు చెందిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో ఉర్దూ భాషాభివృద్ధికి మెరుగైన పనితీరు కనబరిచిన వారికి అవార్డులు ఇస్తారన్నారు. ఆసక్తిగల వారు డీఎండబ్ల్యూఓ, డీఈఓ కార్యాలయాల్లో దరఖాస్తు తీసుకుని పూర్తిగా పూర్తి చేసి తెలంగాణ ఉర్దూ అకాడమీ, నాల్గవ అంతస్తు హౌస్, హైదరాబాద్‌కు నేరుగా గాని, పోస్టుద్వారా పంపించవచ్చునని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు జిల్లా మైనార్టీ కార్యాలయంలో సంప్రదించవచ్చన్నారు.

ఎట్టకేలకు ఎల్‌ఆర్‌ఎస్

ఇక చకచకా నాన్ లే అవుట్ భూముల క్రమబద్ధీకరణ

- కలెక్టర్‌లు, మున్సిపల్ కమిషనర్లు, ఉన్నతాధికారులకు మార్గదర్శకాలు
- మార్చి వరకు ప్రక్రియ పూర్తి చేసేలా ఆదేశాలు
- తాజా ఉత్తర్వులతో మళ్లీ కదలిక...
- ఇప్పటికైనా పూర్తి చేయాలంటున్న దరఖాస్తుదారులు





సాక్షిప్రతినిధి, వరంగల్/జనగామ:

అనుమతి లేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్)కు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన ప్రభుత్వం.. తక్షణమే అమలు చేసేలా ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ మేరకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, కుడా వైస్ చైర్మన్‌లతో పాటు మున్సిపల్ కమిషనర్‌లు, జిల్లాల ఉన్నతాధికారులకు మార్గదర్శకాల ఉత్తర్వులు కూడా అందాయి. చీఫ్ సెక్రటరీ శాంతికుమారి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. మార్చి నాటికి దాదాపుగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పూర్తి చేయాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం ముందుకు సాగాలని సూచించారు.

దరఖాస్తుల క్రమబద్ధీకరణకు అంతా సిద్ధం..

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేసేందుకు అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. మొదటగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వివిధ నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లోనే వడపోసేందుకు రంగం సిద్ధం చేశారు. ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నాయా? దరఖాస్తుదారుడు పూర్తిస్థాయిలో పత్రాలు సమర్పించాడా? లేదా? అన్న అంశాలను పరిశీలిస్తారు. ఉమ్మడి జిల్లాలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు 9 మున్సిపాలిటీలు, వివిధ గ్రామాలనుంచి వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు రెవెన్యూ, నీటిపారుదల, టౌన్ ప్లానింగ్, పంచాయతీ అధికారులు కార్యాచరణ రూపొందించారు. దరఖాస్తుదారులకు సమాచారం ఇస్తూ.. ఆ ప్లాటు, స్థలం వద్దకు రమ్మని జీపీఎస్ ద్వారా పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా నాలాలు, చెరువులు, కుంటలు, వారసత్వ సంపద, శిఖం, దేవాదాయ, ఇనాం భూములు వంటివి పరిశీలించి అభ్యంతరాలు ఉంటే నమోదు చేసుకుని ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తామని చెబుతున్నారు. చివరగా మరోసారి వాటిపై ఉత్తర ప్రత్యుత్తరాలు, పత్రాల పరిశీలన చేసినా అభ్యంతరాలు అలాగే ఉంటే వాటిని తిరస్కరించి సమాచారం ఇస్తామంటున్నారు. అర్హత ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి కావాల్సిన పత్రాలతోపాటు ఫీజు చెల్లించేలా నోటీసు జారీ చేసి.. దరఖాస్తులు సరైనవి అయితే క్రమబద్ధీకరించి ఉత్తర్వులు జారీ చేస్తామని అధికారులు చెబుతున్నారు.

అందరికీ సమాచారం అందేలా ఏర్పాట్లు...

ఉమ్మడి వరంగల్‌లో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సహా 9 మున్సిపాలిటీలు, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తులు స్వీకరించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఈ కార్యక్రమం 2020 అక్టోబర్ 31 వరకు కొనసాగగా, రూ.1000 ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి వివరాలను నమోదు చేసుకున్నారు. మొత్తంగా 1,58,097 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 10,840 దరఖాస్తులు పరిశీలించిన అధికారులు అప్పట్లోనే కొన్ని క్రమబద్ధీకరణ చేయగా.. 1,47,257 వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్నాయి. ఆ తర్వాత ఈ ప్రక్రియకు బ్రేక్ పడగా.. రాష్ట్ర ప్రభుత్వం తాజా ఉత్తర్వుల నేపథ్యంలో అధికార యంత్రాంగం మళ్లీ ఎల్‌ఆర్‌ఎస్ అమలుకు కదిలింది. ఈసారైనా నిబంధనల ప్రకారం చకచకా క్రమబద్ధీకరణ పూర్తి చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

2020లోనే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాం..



2020 అక్టోబర్ మాసంలో 10 ప్లాట్లకు సంబంధించి రూ.వెయ్యి చొప్పున మీ సేవా ద్వారా ఫీజు చెల్లించాం. డాక్యుమెంట్లు తీసుకు రావాలని ఆరు నెలల క్రితం మున్సిపల్ నుంచి ఫోన్ చేశారు. రెగ్యులర్‌గా పని చేసే టీపీఓ లేకపోవడం, సిబ్బంది కొరత కారణంగా ఎల్‌ఆర్‌ఎస్ కోసం మున్సిపల్‌కు వచ్చినా, పని జరిగే పరిస్థితి లేదు. ప్లాట్‌కు సంబంధించి సమస్య ఉంటే, వాటిని వదిలేసి అన్నీ కరెక్టుగా ఉన్న వాటికి క్లియరెన్స్ ఇవ్వాలని కోరినా.. పని జరగలేదు.

\- గుజ్జుల శ్రీనివాస్, గీతానగర్, జనగామ

ఎల్‌ఆర్‌ఎస్ క్లియరెన్స్‌కు సిద్ధంగా ఉన్నాం..



ఎల్‌ఆర్‌ఎస్ క్లియరెన్స్ చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నా. 2020లో మూడు ప్లాట్లకు సంబంధించి ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించా. తన ప్లాట్లతో మున్సిపల్‌కు రూ.3లక్షలకు పైగా ఆదాయం సమకూరుతుంది. ప్లాట్ వద్దకు వచ్చి చూసుకోవాలని గతంలో అధికారులను కోరాం. ఇప్పటికైనా ఎల్‌ఆర్‌ఎస్ కంప్లీట్ చేసి, క్లియరెన్స్ ఇప్పించాలి.

\- శెట్టిపల్లి నరసింహారెడ్డి, జ్యోతినగర్, జనగామ

కార్పొరేషన్/మున్సిపాలిటీల వారీగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు

జిల్లా	మున్సిపాలిటీ	మొత్తం	ఆమోదం	వివిధ స్థాయిల్లో
గ్రేటర్‌వరంగల్	కార్పొరేషన్	1,00,989	2,756	98,233
హనుమకొండ	పరకాల	3,194	06	31,88
వరంగల్	నర్సంపేట	5,219	411	4,808
	వర్ధన్నపేట	524	10	514
మహబూబాబాద్	మహబూబాబాద్	12,201	566	11,635
	డోర్నకల్	872	241	631
	మరిపెడ	2,629	63	2,566
	తొర్రూరు	10,299	606	9,693
జేఎస్ భూపాలపల్లి	భూపాలపల్లి	3,795	1214	2,581
జనగామ	జనగామ	18,375	4,967	13,408

ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి

- డీఐఈఓ జితేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఐఈఓ జితేందర్‌రెడ్డి

జనగామ రూరల్: విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో పాటు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలని డీఐఈఓ జితేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ధర్మకంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేసి సమావేశానికి డీఐఈఓ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు మంచి క్రమశిక్షణతో సమయపాలన పాటిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించడమే కాకుండా ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలన్నారు. రాబోయో వార్షిక పరీక్షలకు సబ్జెక్టుల వారీగా ప్రణాళికను ఏర్పాటు చేసుకొని, ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. సబ్జెక్టులో సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పావని, అధ్యాపకులు వస్కుల శ్రీనివాస్, మరిపెల్ల రవిప్రసాద్, శ్రీకాంత్ రెడ్డి, కాపర్తి శ్రీనివాస్, మహమ్మద్ ముక్తాదిర్, షహనాజ్ తారనం, సబిహా బేగం, తిరుమలేష్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 41 సెంటర్లు, 6,238 మంది విద్యార్థులు
- సందేహాల నివృత్తికి కంట్రోల్ రూం ఏర్పాటు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, పక్కన డీసీపీ రాజమహేంద్రనాయక్

జనగామ రూరల్: పదవ తరగతి వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి టెన్త్ వార్షిక పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే పది పరీక్షలకు 41 సెంటర్లలో 6,238 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి 12:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒకరు చొప్పున 41 సిట్టింగ్ స్క్వాడ్‌లు, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించామన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులు సందేహాల నివృత్తికి 9000293231, 9989544981 కంట్రోల్ రూం నంబర్‌ను అందుబాటులో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రమేష్, ఏసీజీఈ రవి కుమార్, డీసీఈబీ అసిస్టెంట్ సెక్రటరీ రామరాజు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగకు ఏర్పాట్లు చేపట్టాలి

రంజాన్‌కు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రంజాన్ మాసం నిర్వహణ, ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులు, శాంతి కమిటీ సభ్యులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈద్గాల వద్ద తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. మతపెద్దలు సూచించిన అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి విక్రమ్, కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ హుస్సేన్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

జనగామ: జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డీసీపీ రాజమహేంద్రనాయక్‌తో కలిసి కలెక్టర్ మత్తు పదార్థాల నియంత్రణపై విద్య, వ్యవసాయ, ఎక్సైజ్, పోలీసు, వైద్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యాసంస్థల్లో ప్రతీ శుక్రవారం నిర్వహిస్తున్న బ్యాగ్ డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఏఓ రామారావు నాయక్, డీఈఓ రమేష్, కలెక్టరేట్ ఏఓ మన్సూరి, అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

ప్రభుత్వ చేయూతతో మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా పిలుపునిచ్చారు. జనగామ మున్సిపల్ కార్యాలయం పక్కన ఇందిరా మహిళా శక్తి పథకంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టరేట్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: జిల్లాలో కోతల్లేని కరెంటు సరఫరా అందించేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను కలెక్టర్ సందర్శించారు. సబ్ స్టేషన్ నుంచి సరఫరా అయ్యే వ్యవసాయం పంపు సెట్లతో పాటు వివిధ కాలనీలకు సరఫరా చేసే విభాగాలను పరిశీలించారు. విద్యుత్తు సరఫరాకు సంబంధించి ఎప్పటికప్పుడు రికార్డుల్లో వివరాలను నమోదు చేసి, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. విద్యుత్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి, ప్రజలకు అందుబాటులో ఉండి, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కలెక్టర్ వెంట ఎన్‌పీడీసీఎల్ ఆపరేషన్ డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, టెక్నీకల్ డీఈ గణేష్, ఏడీఈ జనగామ ఆపరేషన్ వేణుగోపాల్, పట్టణ ఏఈ–2 పి.చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ నోటీసులు రెడీ!

- మొండిబకాయిదారులకు ఇవ్వనున్న అధికారులు
- ఆస్తి జప్తులకు వాహనాలు సిద్ధం!
- పన్నుల వసూళ్లలో జాప్యంపై కలెక్టర్ ఆరా
- పురపాలికలో ఏసీ సమీక్ష

సాక్షి ఎఫెక్ట్..



ఉద్యోగులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

జనగామ: జనగామ పురపాలికలో వందశాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఏళ్ల తరబడి పన్నులు చెల్లించకుండా మొండికేస్తున్న వారికి రెడ్ నోటీసులు జారీ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. అవసరమైతే ఆస్తి జప్తు చేయాలనే నిర్ణయం తీసుకుంటున్నారు. ‘బకాయిలు ఫుల్.. వసూళ్లు పూర్’ శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ రిజ్వాన్ బాషా స్పందించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ (ఏసీ), పురపాలిక స్పెషల్ ఆఫీసర్ పింకేష్ కుమార్, కమిషనర్ వెంకటేశ్వర్లు, పన్నులు వసూళ్లు చేసే ఉద్యోగులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. వందశాతం పన్నులు వసూళ్ల లక్ష్యంగా గత నెల కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించి దిశా నిర్దేశం చేసినా..ఆశించిన మేర టార్గెట్ ఎందుకు చేరుకోలేక పోయామని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఇంటింటి సర్వే నేపథ్యంలో కాస్త వెనకబడి పోయామని ఉద్యోగులు వివరణ ఇచ్చుకున్నట్లు సమాచారం. మార్చి 31 వరకు వందశాతం పన్నులు వసూళ్లు కావాల్సిందేనని ఆదేశించారు. మొండిబకాయిదారుల జాబితా సిద్ధం చేసి, అవసరమైతే వారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. నోటీసు అందించిన రెండు, మూడు రోజుల్లో స్పందన కనిపించకపోతే ఆస్తులను జప్తు చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఇందుకు జప్తు వాహనాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తుంది. 10 నుంచి 30 వేల వరకు రెడ్ నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది. ఏసీ సమీక్ష పూర్తవగానే ఉద్యోగులు పన్నుల వసూళ్లకు వార్డుల పర్యటన బాట పట్టారు. రోజువారీగా వసూళ్లకు సంబంధించిన వివరాలను నివేదిక రూపంలో అందించాలని కమిషనర్‌ను ఏసీ ఆదేశించారు.

బెంగళూరుకు టికెట్ చార్జీలపై రాయితీ

హన్మకొండ: ప్రయాణికులకు ఆర్టీసీ రాయితీ ప్రకటించింది. బెంగుళూరుకు రాకపోకలు సాధించే ప్రయాణికులకు ప్రస్తుత చార్జీలపై 10 శాతం రాయితీ అందిస్తోంది. ఈ మేరకు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు తగ్గించిన చార్జీల వివరాలు వెల్లడించారు. హనుమకొండ–బెంగుళూరు మధ్య నడిచే అన్ని ఏసీ, సూపర్ లగ్జరీ బస్ చార్జీలపై 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. లహరి ఏసీ స్లీపర్ బెర్త్ బస్ ప్రస్తుత చార్జీలు రూ.1.980 ఉండగా రాయితీ పై రూ.1,770కి తగ్గించారు. లహరి ఏసీ సీట్ బస్ ప్రస్తుత చార్జీ రూ.1,510 ఉండగా రాయితీపై రూ.1,380కి తగ్గించారు. సూపర్ లగ్జరీ బస్ ప్రస్తుత చార్జీ రూ.1,090 ఉండగా దీనిని రూ.వెయ్యికి తగ్గించారు. ఈ చార్జీలను మూడు రోజుల నుంచి అమలు చేస్తున్నట్లు మోహన్‌రావు తెలిపారు.

రేపు 'నిధి ఆప్కే నికత్'

హన్మకొండ అర్బన్ : ఈపీఎఫ్ఓ సభ్యులు, యజమానులు, పెన్షనర్ల ఫిర్యాదుల పరిష్కారానికి ఈనెల 27న నిధి ఆప్కే నికత్ 2.0 కార్యక్రమం నిర్వహించనున్నట్లు వరంగల్ రీజియన్ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ తానయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు సంబంధించి వరంగల్‌లోని వైభవ్ లక్ష్మి షాపింగ్ మాల్, హనుమకొండలోని వరంగల్ పబ్లిక్ స్కూల్, తొర్రూరులోని సెయింట్ పాల్స్ హైస్కూల్, జనగామలోని శాన్ మారియా హైస్కూల్, భూపాలపల్లిలోని ఎస్ఆర్ డీజీ స్కూల్, ములుగులోని శ్రీ అరవింద ఉన్నత పాఠశాల, ఖమ్మంలోని నిర్మల్ హృదయ్ ఉన్నత పాఠశాలల్లో, పాల్వంచ మున్సిపాలిటీలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదుల స్వీకరణతో పాటు పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పీఎఫ్ సభ్యులు, పెన్షనర్లు సద్వినియోగించుకోవాలని సూచించారు.

కూలి డబ్బుల పంపకాల్లో ఘర్షణ.. నలుగురికి జైలు

మహబూబాబాద్ రూరల్ : కూలి డబ్బుల పంపకాల విషయంలో జరిగిన ఘర్షణలో నలుగురిపై దాడిచేసి గాయపరిచిన కేసులో నలుగురు వ్యక్తులకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి తిరుపతి మంగళవారం తీర్పు ఇచ్చారు. కోర్టు డ్యూటీ అధికారి సురేశ్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ రూరల్ పీఎస్ పరిధిలోని జమాండ్లపల్లికి చెందిన కుంచపు శ్రీను, అతడి భార్య ఉమ, బావమరిది నరేశ్, అత్త మంగమ్మ అదే గ్రామానికి చెందిన గుంజె మహేశ్, గుంజె రవి, గుంజె సంతోశ్, గుంజె వినయ్ కలిసి ఓ కాంట్రాక్టర్ వద్ద కూలికి వెళ్లారు. అనంతరం కూలి డబ్బుల పంపకం విషయంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. శ్రీను, ఉమ, నరేశ్, మంగమ్మపై మహేశ్, రవి, సంతోశ్, వినయ్ దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. ఈ ఘటనపై 2019 డిసెంబర్ 17వ తేదీన కుంచపు శ్రీను రూరల్ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రమేశ్ బాబు కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా ఏపీపీ జయలలిత ప్రాసిక్యూషన్ పక్షాన వాదనలు వినిపించారు. ప్రస్తుత రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక ఆధ్వర్యంలో సీడీఓ సురేశ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం నిరూపణకాబడిన మహేశ్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.2 వేలు జరిమానా, రవి, వినయ్, సంతోశ్‌కు ఆరు నెలల చొప్పున జైలుశిక్ష, రూ. వెయ్యి చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తిరుపతి తీర్పు వెలువరించారు.

హర హర మహాదేవ..

నేటి నుంచి రామప్పలో మహాశివరాత్రి ఉత్సవాలు | అధిక సంఖ్యలో తరలిరానున్న భక్తులు | ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

వెంకటాపురం(ఎం): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రామప్ప దేవాలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరగనున్నాయి. యునెస్కో గుర్తింపు పొందిన తర్వాత రామప్ప ఆలయానికి పర్యాటకుల సంఖ్య పెరగడమే కాకుండా విద్యార్థులు, భక్తులు కూడా అధిక సంఖ్యలో తరలివచ్చి రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రామప్పలో మూడు రోజుల పాటు జరిగే మహాశివరాత్రి మహోత్సవాలకు అన్ని శాఖల తరపున అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

రామప్పలో మూడు రోజులు జరిగే కార్యక్రమాలు..

మహాశివరాత్రి సందర్భంగా 26 నుంచి 28వ తేదీ వరకు మూడు రోజులు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు రామప్ప ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్, ఆలయ ప్రధాన అర్చకుడు కోమల్లపల్లి హరీశ్‌శర్మ, అర్చకుడు ఉమాశంకర్ తెలిపారు. 26న ఉదయం 4:30 గంటలకు సుప్రభాతం, 6గంటల నుంచి గణపతి పూజ, అఖండ దీపారాధన, పుణ్యహవచనం, అంకురార్పణ, రక్షబంధనం, సామూహిక రుద్రాభిషేకాలు నిర్వహిస్తామన్నారు. రాత్రి 10 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాగరణ చేపట్టిన భక్తులు రామప్పకు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించి తరిస్తారన్నారు. జాగరణ చేపట్టిన భక్తుల కోసం ఆలయ గార్డెన్‌లో రాత్రి 8 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 27న ఉదయం 5గంటలకు సుప్రభాతం, 6 గంటల నుంచి స్వామివారికి రుద్రాభిషేకాలు, 11గంటలకు గణపతి పూజ, గ్రహారాధన, వీరభద్ర పళ్లెరం, సాయంత్రం 6 గంటల నుంచి భద్రకాళి పూజ, సహస్ర నామార్చన, బలిహరణ, దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 28న తెల్లవారుజామున 4గంటలకు అగ్నిగుండాల మహోత్సవం అంగరంగవైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. 5గంటలకు సుప్రభాతం, గణపతి పూజ, స్వామివారికి రుద్రాభిషేకాలు, 8 గంటలకు నాగబలి, గెలుపు, ఆశీర్వచనం, ప్రసాద వినియోగంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. తమ కోరికలు నేరవేరాలని భక్తులు అగ్నిగుండంలో నడుస్తారు. కాగా, 300 పోలీసులతో రామప్ప ఆలయంతోపాటు చుట్టు పక్కల భారీ బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ములుగు డీఎస్పీ ఎన్. రవీందర్ తెలిపారు. దీంతోపాటు వరంగల్, ఏటూరునాగారం, భూపాలపల్లి వైపుల నుంచి రామప్పకు వచ్చే రహదారులపై పకడ్బందీ బందోబస్తు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


రామలింగేశ్వరస్వామి వారు

మహా శివరాత్రికి కోటగుళ్లు సిద్ధం..

గణపురం : మహాశివరాత్రి ఉత్సవాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలకేంద్రంలోని కోటగుళ్లు సిద్ధమయ్యాయి. శ్రీభవాని సహిత(గణపేశ్వరాలయం) కోటగుళ్లలో శివపార్వతుల కల్యాణంతో పాటు జాగరణకు వచ్చే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు, భజన మండళ్లతో భక్తిగీతాలు ఆలపించేందుకు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ఉదయం అఖండ దీపారాధన, తోరణ బంధనం, రాత్రి 8.30 గంటలకు స్వామి వారి కల్యాణం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో గణపేశ్వర స్వామివారికి రుద్రాభిషేకం, ఈ నెల 27వ తేదీన (గురువారం) ఉదయం 11 గంటలకు స్వామి వారికి మహా అన్న పూజ, 28వ తేదీన (శుక్రవారం) సాయంత్రం స్వామి వారి ఊరేగింపుతో ఉత్సవాలు పూర్తవుతాయని ఆలయ అర్చకుడు నాగరాజు తెలిపారు. విద్యుదీకరణతో కోటగుళ్లు జిగేలుమంటున్నాయి.


విద్యుత్ వెలుగుల్లో కోటగుళ్లు

ఐలోనిలో ప్రత్యేక పూజలు..


అశ్వవాహన సేవలో మల్లికార్జునస్వామివారు

ఐనవోలు: మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండోరోజు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి సమర్పించే నిత్య పూజలతోపాటు గవ్యాంత, వాస్తుపూజలు, పర్యగ్నికరణ, రుద్రహోమం, ప్రాతరౌపాసన బలిహరణలు నిర్వహించారు. లింగోద్భవ కాలంలో స్వామిని అభిషేకించే 108 కలశాలను స్థాపించారు. కాగా, స్వామి, అమ్మవార్లను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. మాడ వీధుల్లో ఉదయం అశ్వవాహన సేవ, సాయంత్రం శేషవాహన సేవ నిర్వహించగా భక్తులు భజనలు చేస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు శ్రీనివాస్, మధుకర్ శర్మ, వేద పండితులు విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భానుప్రసాద్ శర్మ, నందనం మధుశర్మ, పాతర్లపాటి నరేశ్ శర్మ, ఉప్పుల శ్రీనివాస్, మడికొండ దేవేందర్, జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బందోబస్తు ఏర్పాట్ల పర్యవేక్షణ..

మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో పాటు పెద్దపట్నం వద్ద తొక్కిసలాట జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మామునూరు ఏసీపీ తిరుపతి, పర్వతగిరి సీఐ రాజగోపాల్ మంగళవారం బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై శ్రీనివాస్‌కు సూచించారు.

ఓం రుద్రేశ్వరాయ నమః

- వేయిస్తంభాల దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- స్వామివారికి పూజలు, అభిషేకాలు..


చండీహవనంలో డీసీ సంధ్యారాణి, తదితరులు


రుద్రేశ్వర స్వామివారు

హన్మకొండ కల్చరల్ : నగరంలోని శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో మంగళవారం ఉదయం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు మణికంఠశర్మ, అర్చకులు ప్రణవ్, సందీప్‌శర్మ సుప్రభాత సేవ, ఉత్తిష్టగణపతికి నవరసాభిషేకం, ఆరాధన, శ్రీరుద్రేశ్వరశివలింగానికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం దేవాలయంలో శ్రీరుద్రేశ్వరీరుద్రేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉత్సవ విగ్రహాలకు మంగళస్నానం, పుణ్యాహవచనం, ఋత్విక్‌కరణం, అంకురారోపణ, నవగ్రహమండపారాధన, కలశస్థాపన, పాలికాపూజ, షోడశోపచారపూజలు చేశారు. యాగశాల వద్ద ఋత్విక్‌కరణ, యాగశాలలో అగ్నిప్రతిష్ఠాపన జరిపి, లోకకల్యాణార్థం గణపతి నవగ్రహ రుద్రసహిత 19 అధ్యయాలతో మహాచండీ హోమం నిర్వహించారు. దేవాదాయశాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, అసిస్టెంట్ కమిషనర్ రామల సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి..

హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి దేవాలయంలో ప్రతిష్ఠించిన శ్రీరుద్రేశ్వరీరుద్రేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాల ఎదుట జ్యోతి వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. కాగా, సాయంత్రం ప్రదోషకాల పూజ పంచమహా హారతి నిర్వహించారు. బుధవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉదయం 3 గంటలకు అఘోరపాశుపత రుద్రాభిషేకం నిర్వహించిన అనంతరం సామూహిక రుద్రాభిషేకాలు ప్రారంభమవుతాయని, భక్తులు ఉదయం 5 గంటల నుంచి రుద్రేశ్వరుడిని దర్శించుకోవచ్చని ఉపేంద్రశర్మ తెలిపారు.

శివ పూజకు వేళాయె..

- కాళేశ్వరాలయంలో ఏర్పాట్లు పూర్తి
- నేడు శ్రీశుభానంద–ముక్తీశ్వరుల కల్యాణం


శివరాత్రి ఉత్సవాల ప్రారంభ పూజ నిర్వహిస్తున్న అర్చకులు

కాళేశ్వరం: ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా శివ పూజకు సర్వం సిద్ధం చేశారు. దేవస్థాన అధికారులు ఆలయంతో పాటు గోదావరి తీరం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళవారం స్వామివారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలతో శివరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

ప్రత్యేక పూజలతో..

మహదేవపూర్ టస్సర్ కాలనీకి చెందిన దేవాంగ కులస్తులు నేసిన పట్టువస్త్రాలను ఉత్సవ మూర్తులకు ధరింపజేసి పూజలు ప్రారంభించారు. కల్యాణ మండపంలో ఉదయం 10గంటలకు మంగళవాయిద్యాలతో దీపారాధన, గణపతి పూజ స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, దీక్షావస్త్రధారణ, ఋత్విగ్వర్ణన మత్సంగ్రహణం, 11గంటలకు దేవతాహ్వానం నవకలశారాధన, నవగ్రహారాధన, 12గంటలకు మండప దేవతారాధన, వృషభధ్వజ పటాదివాసం పూజలు చేశారు. సాయంత్రం 4 గంటలకు అగ్ని ప్రతిష్ఠ, రుద్రహవనం, రాత్రి 8 గంటలకు పుర వీధుల గుండా ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, ఎదురుకోలు సేవ కార్యక్రమం నిర్వహించారు. 8.30గంటలకు కళాకారులతో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ మహేశ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, స్థానిక నాయకులు శ్రీనివాసరెడ్డి, అశోక్, రాజబాపు తదితరులు పాల్గొన్నారు.

శుభానంద–ముక్తీశ్వరుల కల్యాణానికి ఏర్పాట్లు..

మహాశివరాత్రి సందర్భంగా బుధవారం సాయంత్రం 4.35గంటలకు శ్రీముక్తీశ్వరస్వామి–శ్రీశుభానందదేవిల కల్యాణం వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈకార్యక్రమానికి తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. కల్యాణంతో పాటు అర్ధరాత్రి లింగోద్భవపూజకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గోదావరి వద్ద జల్లు స్నానాలు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులు, మూడు చోట్ల పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. మంగళవారం కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్ ఏర్పాట్లు పరిశీలించారు. 300 మందితో ఎస్పీ కిరణ్‌ఖరే ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

టీచర్ గౌరవం పెంచే అభ్యర్థిని గెలిపించండి

- ఉపాధ్యాయులు ఓటును అమ్ముకోవద్దు
- ఎమ్మెల్సీ కోదండరాం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

నయీంనగర్: ఉపాధ్యాయ సమస్యలు తెలిసి నిజాయితీతో పనిచేసే వారికి, టీచర్ గౌరవం పెంచే అభ్యర్థికి ఓటువేయాలని ఎమ్మెల్సీ కోదండరాం ఉపాధ్యాయులను కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వరంగల్–ఖమ్మం–నల్లగొండ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డికి మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రస్తుతం టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో డబ్బులు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. అయితే డబ్బులకు ఆశపడి ఓటు అమ్ముకుంటే రాబోయే రోజుల్లో ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావన్నారు. విద్యాశాఖలోని అన్ని స్కూళ్లలో పనిచేసే ఉపాధ్యాయులకు గ్రీన్ చానల్ ద్వారా జీతాలు ఇవ్వాలని, పెన్షన్ ఉద్యోగి హక్కు అని తెలిపారు. పన్నాల గోపాల్‌రెడ్డి నాలుగు దశాబ్దాలుగా ఉపాధ్యాయ సమస్యల పరిష్కార ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారన్నారు. వారి సమస్యలు బలంగా లేవనెత్తి ఉపాధ్యాయులకు న్యాయం చేకూర్చారన్నారు. అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థులు ఇచ్చే తాయిలాలకు అమ్ముడుపోకుండా, జాతి నిర్మాతలైన ఉపాధ్యాయుల గౌరవం పెంచేలా నిజాయితీ, నిబద్ధత కలిగిన వారిని ఎన్నుకోవాలని కోరారు. సమావేశంలో రాజేంద్రప్రసాద్, నాగేశ్వర్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోగస్ మాటలు కట్టిపెట్టండి

- మిర్చి రైతులకు న్యాయం చేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వరంగల్: అబద్ధాలు చెప్పి కేంద్రంలో బీజేపీ, బోగస్ మాటలు చెప్పి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాయని కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డిలు, సీఎం రేవంత్‌రెడ్డిలు ఇప్పటికైనా ఆ మాటలు కట్టిపెట్టి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌ను నర్సంపేట, భూపాలపల్లి, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, నరేందర్‌లతో కలసి సందర్శించారు. మిర్చి రైతులతో మాట్లాడి కొనుగోళ్లు, ధర తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'రేవంత్‌రెడ్డి... ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకో, అబద్ధాలు మాట్లాడడం మానుకో, రైతుబంధు ఇవ్వలేదు. రుణమాఫీ 50శాతం పూర్తి కాలేదు. ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి వస్తే మిర్చి క్వింటాల్‌కు రూ.15వేలకు తగ్గకుండా చూస్తామన్న హామీ ఎక్కడికి పోయింది' అని అన్నారు. రూ. 25వేలు పెట్టి కొనుగోలు చేసేంత వరకు రైతుల పక్షాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, నరేందర్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఏప్రాంతంలో ఎలాంటి పంటలు వేస్తారు. ఏ మేరకు సాగు చేస్తారన్న విషయాలు కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలకు తెలియకపోవడంతో ఈ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మంత్రులు సురేఖ, సీతక్క, అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఒక్కనాడు రైతుల గురించి, ఏనుమాముల మార్కెట్‌లో జరుగుతున్న వ్యవహారంపై మాట్లాడలేదన్నారు. కుంభకోణాలతో పాటు ధాన్యం, సీసీఐ కొనుగోళ్లలో మీపాత్ర స్పష్టంగా ఉంటోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు నాగుర్ల వెంకటేశ్వర్లు, చింతం సదానందం, టి.రమేశ్‌బాబు, వాసుదేవరెడ్డి, కేతిరి రాజశేఖర్, సుభాశ్, చిలువేరు పవన్ తదితరులు పాల్గొన్నారు.


ఏనుమాముల మార్కెట్‌లో రైతులను మిర్చి ధరలను అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు నరేందర్, సుదర్శన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి

కమ్యూనిస్టుల పునరేకీకరణకు కృషి



వరంగల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

న్యూశాయంపేట: దేశంలో, రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులున్నా ప్రజల కోసం కమ్యూనిస్టు పార్టీలు పోరాడుతాయని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమ్యూనిస్టు పార్టీల పునరేకీకరణకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో జరిగిన కులగణనను స్వాగతిస్తున్నామన్నారు. దీనితో రాజకీయాల్లో పెనుమార్పులు రానున్నాయని తెలిపారు. తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ఆరోపించారు. నిధుల లేమితో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక కాంగ్రెస్ పార్టీ తంటాలు పడుతోందన్నారు. రేవంత్ రెడ్డి గట్టోడని, అందుకే అప్పుల కుప్ప నుంచి గట్టెక్కించేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ రూ.7లక్షల కోట్లు అప్పు చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పొత్తు ధర్మాన్ని పాటించి సీపీఐకి రెండు ఎమ్మెల్సీ పదవులు కేటాయించాలన్నారు. మోదీ పాలనలో గజదొంగలను వెనకేసుకురావడంతో వ్యవస్థ దెబ్బతిందన్నారు. ప్రస్తుతం జమిలీ ఎన్నికలకు తెర తీశారని, ఈ ఎన్నికలు రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని నియంత్రించడమేనని పేర్కొన్నారు. నాయకులు టి.శ్రీనివాస్‌రావు, కర్రెభిక్షపతి, ఆదిరి శ్రీనివాస్, సదాలక్ష్మి, మద్దెల ఎల్లేశ్, ఎం.లింగారెడ్డి, లక్ష్మణ్,ఎం. భిక్షపతి, రాజు, సారంగపాణి, రవి, సదానందం, శంకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్‌లో శత వసంతాల భారీ ప్రదర్శన, సభ

వరంగల్: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)100వ ఆవిర్భావ వేడుకల సందర్భంగా వరంగల్ జిల్లా కేంద్రంలో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన సభకు పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి అధ్యక్షత వహించగా జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడారు. దేశంలో కమ్యూనిస్టులు బలబడాల్సిన అవసరం ఉందని, అందుకు కమ్యూనిస్టులు పునరేకీకరణ కావాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

బహుజనులు ఐక్యత చాటాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్


తొర్రూరు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్

విద్యారణ్యపురి/తొర్రూరు: వరంగల్–ఖమ్మం–నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు బహుజనుల ఐక్యతకు రెఫరెండమని, ఈ ఎన్నికల్లో బరిలో ఉన్న తనకు ఉపాధ్యాయులు, అధ్యాపకులు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండ, తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి జరగాలంటే రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఎన్నికల్లో పలువురు అభ్యర్థులు మేధావుల ఓట్లు కొనాలని అనుకుంటున్నారని, ఉపాధ్యాయ సమాజం దీనిని తిప్పికొట్టాలని కోరారు. తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో కేజీబీవీ ఉపాధ్యాయులకు ప్రసూతి, చైల్డ్ కేర్ సెలవులు 60 రోజులు ఇప్పించానని, బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ తీసుకొచ్చానన్నారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించేలా మండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. ఈ ఎన్నికల్లో తాను గెలిస్తే సీపీఎస్‌ను రద్దుచేయిస్తానని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 కిందవేతనాలు, ఇంక్రిమెంట్లు ఇప్పిస్తానన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్టీయూ, జాక్టో నాయకులు పాల్గొన్నారు.